ఈ రహదారిపై నడిచేదెలా?

అధ్వానంగా ఆనెగుంట–మల్‌చల్మ రహదారి


బురదమయంగా ఆనెగుంట–మల్‌చల్మ రహదారి

జహీరాబాద్‌: మండలంలోని ఆనెగుంట గ్రామం నుంచి మల్‌చల్మ గ్రామానికి వెళ్లే రహదారి బురదతో కూడుకుని మరింత అధ్వానంగా మారింది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించడం కష్టంగా ఉంది. ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆనెగుంట గ్రామంతో పాటు పక్కనే ఉన్న లచ్చునాయక్‌తండా, ఒంటిలగడ్డ తండా ప్రజలు అనునిత్యం అవసరాల నిమిత్తం మల్‌చల్మ గ్రామానికి వెళ్లి వస్తారు. ఆనెగుంట నుంచి మల్‌చల్మ గ్రామం వరకు సుమారు 3.5 కిలోమీటర్ల రహదారి బురద మయంగా మారి రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మల్‌చల్మ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రెండు బ్యాంకులు, పీఏసీఎస్‌ సొసైటీ, సబ్‌స్టేషన్‌లు ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రతినిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఆస్పత్రికి వెళ్లే గర్భిణులు రహదారిపై ప్రయాణం చేయాలన్నా అవస్థలు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్ద కాలం క్రితం నిర్మించిన కంకర రోడ్డు పూర్తిగా దెబ్బతిని బురదమయంగా తయారయింది. బురదలో నుంచి ద్విచక్రవాహనాలను నడపలేని పరిస్థితి నెలకొంది. ప్రతి పనికి మల్‌చల్మ వెళ్లాల్సి వస్తోందని, దీనిని గుర్తించి వెంటనే రహదారిని నిర్మించి తమ ఇబ్బందులను శాశ్వతంగా దూరం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులు, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

> **ఎవరూ పట్టించుకోవడం లేదు**
>
> తమ గ్రామం నుంచి ప్రతినిత్యం వందలాది మంది మల్‌చల్మకు వెళ్లి వస్తుంటారు. తమ గ్రామం మీదుగానే పక్కన ఉండే రెండు తండాల ప్రజలు కూడా ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తారు. రోడ్డంతా చిత్తడిగా మారడంతో రాకపోకలు సాగించడం కష్టంగా ఉంది. ఈ విషయమై అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా స్పందించి తమ ఇబ్బందులు శాశ్వతంగా దూరం చేయాలి.
>
> – నాగిశెట్టి, మాజీ ఎంపీటీసీ, ఆనెగుంట

క్లుప్తంగా

పంటల పరిశీలన


రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ సారిక

రాయికోడ్‌(అందోల్‌): మండలంలోని కర్చల్‌ గ్రామంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటను మండల వ్యవసాయ అధికారి సారిక సోమవారం పరిశీలించారు. రైతులకు పంట సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పత్తి చేనులో నిలిచిన వర్షం నీటిని బయటకు పంపడంపై రైతులు దృష్టి సారించాలన్నారు. నీటిని బయటకు పంపిన అనంతరం రక్షణ చర్యలు చేపడితే పత్తి మొక్కలు పాడవకుండా ఉంటాయన్నారు. నీరు నిలిచిన పొలాల్లో ఎలాంటి ఎరువులు చల్లినా, క్రిమిసంహారకాలు వినియోగించినా ఫలితం ఉండదన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నవీన్‌, రైతులు ఉన్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు


వర్షానికి కూలిన జానయ్య ఇల్లు

జహీరాబాద్‌ టౌన్‌: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి మొగుడంపల్లి మండలంలో మూడు పెంకుటిళ్లు కూలిపోయాయి. మన్నాపూర్‌ గ్రామంలో మెటల్‌కుంట జానయ్య పెంకుటింటిలో నివాసం ఉంటున్నారు. భారీ వర్షానికి ఆదివారం రాత్రి పైకప్పు గోడ కూలింది. ఎలాంటి ఆసరాలేని తమను ప్రభుత్వం ఆదుకోవాలని జానయ్య కోరారు. మండల కేంద్రం మొగుడంపల్లిలోని బోయిన యశోద, తుడుం వసంత్‌ ఇళ్లు కూడా వర్షాలకు గోడలు కూలాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఖేడ్‌ డిపో తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న కుష్‌రూ షా ఖాన్‌

నారాయణఖేడ్‌: ఆర్టీసీ హైదరాబాద్‌ జోన్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌(ఈడీ)కుష్‌రూ షా ఖాన్‌ ఖేడ్‌ డిపోను సోమవారం మెదక్‌ రీజియన్‌ మేనేజర్‌ విజయ్‌భాస్కర్‌, డిప్యూటీ రీజియన్‌ మేనేజర్‌ ఎస్‌.హెచ్‌.కె.మూర్తి, హైదరాబాద్‌ జోన్‌ డిప్యూటీ సీటీఎం శ్రీనివాస్‌లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యారేజీ, డీఎం కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. డిపోలో బస్సులు, రోజూ ప్రయాణించే కి.మీలు, సమకూరుతున్న ఆదాయం, స్టాఫ్‌ వివరాలు, ఉచిత ప్రయాణం తదితర విషయాల గురించి డీఎం మల్లేశయ్య, అసిస్టెంట్‌ డీఎం నర్సింహులు, మెకానికల్‌ ఇంజనీరు దశరథరావు, సీనియర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ నందూలాల్‌లను అడిగి తెలుసుకున్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు


సామూహిక పూజలు చేస్తున్న దంపతులు

సదాశివపేట(సంగారెడ్డి): చివరి శ్రావణ సోమవారం సందర్భంగా పట్టణంలోని శివాలయాల్లో ఆలయాల్లో భక్తులు స్వామివారికి అభిషేకం, బిల్వార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని సంగమేశ్వర, ఈశ్వర మార్కండేయ, ఎడ్ల బజార్‌ బసవేశ్వర, మహాలింగస్వామి శివాలయం, శంబులింగేశ్వర, మల్లీకార్జునస్వామి మందిరాల్లో భక్తులు సామూహిక అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని భ్రమరాంబ సమేత మల్లీకార్జున స్వామి ఆలయంలో 1983–84 పూర్వ విద్యార్థుల బృందం ఆధ్వర్యంలో దంపతులు సామూహిక లక్షబిల్వార్చన పూజలు చేశారు. మండలంలోని అంకేనపల్లి కూడలి వద్ద గల పార్వతీపరమేశ్వర మందిరంలో దంపతులు భక్తులు సామూహిక అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పులిమామిడి రాజుకు పరామర్శ

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డి జిల్లా ముదిరాజ్‌ సంఘం అధ్యక్షుడు పులిమామిడి రాజు స్వగృహంలో సోమవారం రాత్రి తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌ బండప్రకాష్‌ ముదిరాజ్‌ పరామర్శించారు. ఇటీవల పులిమామిడి రాజు మాతృమూర్తి భాగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కార్యక్రమంలో డిప్యూటీ ఎంఆర్‌ఓ బాల్‌రాజ్‌, ఆర్‌ఐ. గంగాధర్‌, మామిళ్ల రాజేందర్‌, పట్నం మాణిక్యం, ముదిరాజ్‌ సంఘం నేతలు పాల్గొన్నారు.

చేపల చెరువులు తవ్వితే చర్యలు

ఇరిగేషన్‌ ఏఈ నిషిత


చేపల చెరువులను పరిశీలిస్తున్న అధికారులు

వట్‌పల్లి(అందోల్‌): సింగూర్‌ ప్రాజెక్ట్‌ పరివాహక ప్రాంతంలో అక్రమంగా చేపల చెరువుల తవ్వితే చర్యలు తప్పవని ఇరిగేషన్‌ ఏఈ నిషిత హెచ్చరించారు. వట్‌పల్లి మండలంలోని ఖాదిరాబాద్‌ గ్రామంలో డ్యాం పరిధిలో చేపల చెరువుల తవ్వకాలు జరిపినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం రెవెన్యూ, ఇరిగేషన్‌, పోలీస్‌శాఖల అధికారులు గ్రామానికి చేరుకొని చేపల చెరువులను పరిశీలించారు. మొత్తంగా 7 చేపల చెరువులను పరిశీలించగా వాటిలో 5 చెరువులు ప్రాజెక్ట్‌ పరిధిలో అక్రమంగా తవ్వినట్లు గుర్తించారు. వెంటనే అక్రమ చెరువులను జేసీబీ సహాయంతో తొలిగించే క్రమంలో చేపల పెంపకందారులు తాము ఉపాధి కోసం పొట్ట చేత పట్టుకొని పిల్లాపాపలతో వందల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చామని అప్పుడే కూల్చేయకండి ప్రాధేయపడుతూ అధికారులను వేడుకున్నారు. దీంతో చెరువుల్లో ఉన్న చేప పిల్లలను పట్టుకోవడానికి పదిహేను రోజుల గడువు ఇస్తున్నట్లు అధికారులు వారికి తెలియజేశారు. చేపల తవ్వకాల విషయంలో తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, ఒకటి, రెండు రోజుల్లో మండలంలోని ఉసిరికపల్లి, నిర్జప్ల, భూత్కూర్‌ తదితర గ్రామాల్లో తనిఖీలు చేసి డ్యాం పరిధిలోని అక్రమ చేపల చెరువులను తొలిగిస్తామని ఏఈ తెలిపారు. తహసీల్దార్‌ చంద్రశేఖర్‌, ఎస్‌ఐ లవకుమార్‌, ఇరిగేషన్‌ వర్క్‌ఇన్‌స్పెక్టర్‌ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి

సర్వాయి పాపన్న గౌడ్‌ జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆయన చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు.


సంగారెడ్డి జోన్‌: నివాళులర్పిస్తున్న నాయకులు


జోగిపేటలో..


సదాశివపేట పట్టణ బీజేపీ కార్యాలయంలో..


పటాన్‌చెరుటౌన్‌: నివాళులర్పిస్తున్న నీలం మధు


హత్నూర మండలం దేవులపల్లిలో..


జహీరాబాద్‌ టౌన్‌: పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

టీచర్స్‌ మేళా ప్రారంభం

పుల్‌కల్‌(అందోల్‌): మండల పరిధిలోని ఉపాధ్యాయులకు టీఎల్‌ఎం (టీచర్స్‌ లర్నింగ్‌ మేటీరియల్‌) మేళా నిర్వహించారు. పుల్‌కల్‌ ఉన్నత పాఠశాలలో ఈ మేళాను నిర్వహించారు. 45మంది టీచర్లు పాల్గొని 95 ప్రదర్శనలు ఉంచారు. ఈ మేళాలో ఎంపీడీఓ ఆనంద్‌ మేరీ, పంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి ఎంఈఓ శంకర్‌ హాజరై ఉత్తమ ప్రదర్శనను ఎంపిక చేశారు.

కృష్ణదాస్‌కు సన్మానం


కృష్ణదాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): హైదరాబాద్‌కు వెళ్తున్న కేంద్ర రైల్వే బోర్డు మాజీ చైర్మన్‌ కృష్ణదాస్‌కు సోమవారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి రామచంద్రాపురంలో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక ఆహ్వానం మేరకు కృష్ణదాస్‌ తన ఇంటికి వచ్చారని తెలిపారు. కార్యకర్తలతో కలసి ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముత్తిరెడ్డి, ప్రతాప్‌ రెడ్డి, నాయకులు రామకృష్ణ, రాజు రాథోడ్‌, ఆదిత్యలు పాల్గొన్నారు.

రేడియల్‌ రోడ్డుపై వర్షం నీరు


రేడియల్‌ రోడ్డుపై నిలిచిన నీరు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌ మున్సిపల్‌ కార్యాలయం ఎదుట ఉన్న రేడియల్‌ రోడ్డుపై వర్షం నీరు భారీగా చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్‌ కార్యాలయం ముందే ఈ పరిస్థితి ఉంటే పట్టించుకోని అధికారులకు తమ సమస్యలను ఎలా పరిష్కరిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలని డిమాండ్‌ చేశారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి


ఎమ్మెల్యేను సన్మానించిన నిర్వాహకులు

పటాన్‌చెరు: నియోజకవర్గం పరిధిలో నూతన దేవాలయాల నిర్మాణానికి, అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్‌ మున్సిపల్‌ పరిధిలోని రెండో వార్డులోని రేణుక ఎల్లమ్మతల్లి దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయ్‌కుమార్‌, మాజీ కౌన్సిలర్‌ కృష్ణ, ప్రమోద్‌రెడ్డి, గోపాల్‌, రుశ్వంత్‌రెడ్డి, తలారి రాములు, దాసు, ప్రతాప్‌ రెడ్డి పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా మున్సిపాలిటీ అభివృద్ధి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రణాళికబద్ధంగా మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు కేటాయించి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. సోమవారం బొల్లారం మున్సిపల్‌ పరిధిలోని పలు కాలనీలో సుడిగాలి పర్యటనలతో ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి పలు పనులకు శంకుస్థాపనలు చేశారు. రెండు కోట్ల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే ఎమ్మెల్సీ శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి , మున్సిపల్‌ కమిషనర్‌ కిషన్‌ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ విధానాన్ని రద్దు చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరించిన నాయకులు

రాయికోడ్‌(అందోల్‌): సీపీఎస్‌ విధానాన్ని రద్దు చేయాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు యాదవులు అన్నారు. రాయికోడ్‌లోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సోమవారం సెప్టెంబర్‌ 1న నిర్వహించే మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ ఉపాధ్యాయులకు శాపంగా మారింది. సీపీఎస్‌ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర, మండల సంఘాల నాయకులు నర్సింలు, శ్రీనివాస్‌, పాండురంగారెడ్డి, హెచ్‌ఎం ఖైరత్‌ అలీ ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సీపీఐ నేత రెహమాన్‌

సంగారెడ్డి ఎడ్యుకేషన్‌: 20 నుంచి 22వ తేదీ వరకు మేడ్చల్‌ జిల్లా మల్కాజ్‌గిరిలో జరిగే సీపీఐ రాష్ట్ర నాల్గొవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఏ రెహమాన్‌ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 100 ఏళ్ల నుంచి ఎలాంటి స్వార్థ ప్రయోజనాలు లేకుండా ఉద్యమాలను నిర్వహించిందన్నారు. మహాసభల్లో జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మహబూబ్‌ ఖాన్‌, ఎంఏ.ఖాజా, లక్ష్మి, అనురాధ, శివశంకర్‌, శివలీల తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధనోపకరణాల ఎంపిక


మెమొంటోలు అందుకున్న ఉపాధ్యాయులు

రాయికోడ్‌(అందోల్‌): రాయికోడ్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. మేళాలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తమ బోధనోపకరణాలను ప్రదర్శించారు. మండల విద్యాధికారి మాణెయ్య ఉపాధ్యాయుల బోధనోపకరణాలను పరిశీలించారు. పది రకాల బోధనోపకరణాలను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. వాటిని తయారు చేసిన ఉపాధ్యాయులకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఖైరత్‌ అలీ, నర్సింలు, ఖైరత్‌ అలీ, శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది తులసి, యాదవులు, సౌజన్య, కృష్ణ, అనిల్‌, రాజు, దత్తు ఉన్నారు.

భూబాధితుల సమస్యను పరిష్కరించండి


మాట్లాడుతున్న రైతులు, నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం పట్టణ పరిధిలోని సర్వే నంబర్‌ 1, జంగంపేట గ్రామంలోని సర్వే నంబర్‌ 376 సమస్యను కలెక్టర్‌ ప్రావీణ్యను కలిసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. అనంతరం జిన్నారంలో విలేకరులతో మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో 180 ఎకరాలు తీసుకున్న విషయం తెలిసిందేనని ఇప్పటికైనా మాభూములు మాకు ఇవ్వాలని లేని పక్షంలో 600 గజాల హెచ్‌ఎండీఏ లేఔట్‌ చేసి ఇవ్వాలని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, జిన్నారం మున్సిపాలిటీ శివారులోని లోతు వాగు వద్ద నాలా స్థలంలో అక్రమంగా నిర్మాణాలను చేపడుతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే అక్రమ నిర్మాణాలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌ రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌ గౌడ్‌, శ్రీకాంత్‌ గౌడ్‌, బ్రహ్మేంద్ర గౌడ్‌, నిఖిల్‌ గౌడ్‌, విట్టల్‌, పోచయ్య, భిక్షపతి, బాధిత రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

జహీరాబాద్‌ టౌన్‌: పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు సోమవారం మున్సిపల్‌ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌ నాయకులు మహిపాల్‌ మాట్లాడుతూ..వారం రోజుల పాటు పట్టణంలో బస్తీబాట కార్యక్రమం నిర్వహించామని, ప్రజల నుంచి అనేక సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. రోడ్లు, మురికి కాలువలు, తాగునీరు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు తది తర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మున్సిపల్‌ అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లామని.. వాటిని పరిష్కరించాలని కోరామన్నారు. లేని యెడల ప్రజల తరపున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

◆ అందుబాటులో యూరియా

మునిపల్లి(అందోల్‌): రైతులకు అందుబాటులో యూరియా ఉందని మండల వ్యవసాయాధికారి అంజలి తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దచల్మెడ వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఎకరాకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు. 30 మెట్రిక్‌ టన్నుల యూరియా మండలానికి వచ్చిందన్నారు. పెద్దచల్మెడ వ్యవసాయ సహకార పరపతి సంఘానికి 25 మెట్రిక్‌ టన్నులు, తాటిపల్లి హాకాలో మరో 15 మెట్రిక్‌ టన్నుల యూరియా వచ్చిందన్నారు. 25 మెట్రిక్‌ టన్నుల యూరియా పెద్దచల్మెడ వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తాటిపల్లి హాకాలో త్వరలోనే రైతులకు యూరియా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

◆ అన్ని రంగాల్లో రాణించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు వారిని తీర్చిదిద్దాలని తెల్లాపూర్‌ లయన్స్‌ కబ్‌ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ అన్నారు. సోమవారం తెల్లాపూర్‌ జిల్లా పరిషత్‌ పాఠశాలలో లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

◆ అనుమతులు తప్పనిసరి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని గణేశ్‌ ఉత్సవ నిర్వాహకులు, యువకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌ అనుమతులు తీసుకోవాలని సీఐ రవీందర్‌ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు రూపొందించిన ప్రత్యేక వెబ్‌సైట్‌లో గణేష్‌ మండపాల ఏర్పాటుకు సంబంధించి వివరాలను నమోదు చేసి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజల మధ్యలో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భారతినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ వి.సింధు రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌ పరిధిలోని మ్యాక్‌ సొసైటీ కాలనీలో రూ.32లక్షలతో చేపట్టిన చైన్‌లింక్‌ మెష్‌ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొంతమంది రోడ్ల పక్కనే చెత్త వేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. అందులో భాగంగా మ్యాక్‌ సొసైటీకి వెళ్లే మార్గంలో చైన్‌లింక్‌ మెష్‌ వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ కోఆర్డినేటర్‌ వి.ఆదర్శ్‌ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

◆ పాఠశాలకు తాగునీటి సౌకర్యం

వట్‌పల్లి(అందోల్‌): అందోల్‌ మండలంలోని తాడ్మన్నూర్‌ ప్రాథమిక పాఠశాలలో తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ మాజీ సర్పంచ్‌ సంగీత దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి నూతనంగా బోరుమోటారు వేయించి సోమవారం మోటార్‌ బిగించారు. తాగునీటి సౌకర్యం కల్పించడంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అనిల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రాధానోపాధ్యాయులు నవీన్‌, నాయకులు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

◆ కొత్త రేషన్‌కార్డుల పంపిణీ

జహీరాబాద్‌: మండలంలోని శేఖాపూర్‌ గ్రామంలో సోమవారం లబ్ధిదారులకు కొత్త రేషన్‌ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం దశాబ్దకాలంగా అర్హులైన పేదలకు రేషన్‌ కార్డులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. గమనించిన సీఎం రేవంత్‌రెడ్డి కొత్త రేషన్‌కార్డులను అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు అక్బర్‌ హుసేన్‌, మల్లారెడ్డి, ఇమాం పటేల్‌, నర్సింహులు నాయకులు పాల్గొన్నారు.

◆ ఎస్టీ గురుకుల పాఠశాల తనిఖీ

జహీరాబాద్‌ టౌన్‌: మండల కేంద్రం మొగుడంపల్లిలోని బాలికల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను సోమవారం మండల అధికారులు తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్‌ శ్రీనివాస్‌, ఎంపీడీఓ మహేశ్‌, ఏఈ ప్రవీణ్‌, ఆర్‌ఐ.సిద్దారెడ్డి తదితరులు గురుకులాన్ని సందర్శించి సౌకర్యాలు, ఆహారం, విద్యార్థుల ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. ఇద్దరు విద్యార్థినులు జర్వంతో బాధపడుతుండటంతో వైద్యులను పిలిపించి వారికి చికిత్స అందించారు. విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత గురించి తెలుసుకున్నారు.

◆ అన్నపూర్ణేశ్వరుడిగా గణనాథుడు

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని గణేశ్‌ గడ్డ దేవస్థానంలో శ్రావణమాసం చివరి సోమవారం పురస్కరించుకొని ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. శ్రావణ మాసం చివరి సోమవారం నేపథ్యంలో అభిషేకం, ప్రత్యేక పూజలతో పాటు స్వామివారిని అన్నంతో అన్నపూర్ణేశ్వరుడిగా అలంకరించారు.

◆ సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ

సంగారెడ్డి: నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ అందజేశారు. రూ. 1.71 లక్షల విలువ గల 67 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చెక్కుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే ప్రభాకర్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

◆ చెరువులు, కుంటలకు జలకళ

జిన్నారం (పటాన్‌చెరు): వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉమ్మడి జిన్నారం, గుమ్మడిదల మున్సిపాలిటీలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. జిన్నారంలోని అక్కమ్మచెరువు, ఊట్ల చెరువు, వావిలాల చెరువు, మాదారం చెరువులు అలుగు పారడంతో గ్రామస్తులు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. సమృద్ధిగా కురిసిన వర్షాలతో చెరువులు జలకళను సంతరించుకున్నాయని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు.